
కథ

హోతా పద్మినీదేవి




"చాలా మంచి సంబంధం నాన్నా! మన శ్రావణిని ఎవరిదో పెళ్ళి కేసెట్‌లో చూసి వాళ్ళు ఇష్టపడ్డారు. వాళ్ళంతట వాళ్ళుగా శ్రావణిని వాళ్ళబ్బాయికి చేసుకుంటామని మధ్యవర్తిని పంపి మరీ అడిగారు" శివరామ్ స్వరంలో ఆనందం.

"అవును మామయ్యా! మనకంటే ఎన్నో మెట్లు పైనున్న వాళ్ళు శ్రావణిని కోడలిగా చేసుకుంటామని అడగడం నిజంగా మన అదృష్టం" సుమతి సంబరంగా చెప్పింది.

"వాళ్ళు మనస్ఫూర్తిగానే శ్రావణిని ఇష్టపడ్డారా?" ఆయన స్వరంలో అపనమ్మకం.

"అదేమిటి నాన్నా అలా అడుగుతున్నారు?"

"అంత డబ్బున్న వాళ్ళు మనలాంటి మధ్యతరగతి వాళ్ళతో వియ్యమందాలనుకోడం..."

"మధ్యవర్తిని అదే మాట అడిగాను. శ్రావణి వాళ్ళకి చాలా నచ్చిందిట. మన కుటుంబ సాంప్రదాయం గురించి విని ముందుకొచ్చారుట. అబ్బాయి ఫోటో మనకి ఇచ్చారు. ఒక మోస్తరు అందగాడే ఫర్వాలేదు. బిటెక్ అయ్యాక ఎమ్‌బిఏ చేసాడుట. స్వంతంగా బిజినెస్ చేస్తున్నాడు"

"అవన్నీ సరే! వాళ్ళు మన శ్రావణిని సరిగ్గా చూశారా?"

"వాళ్ళే ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తారుట"

అప్రయత్నంగానే శ్రావణి చెయ్యి తన కుడి చెక్కిలిని తాకింది.

పచ్చి పసుపు పాల మీగడ గులాబీ రేకులు అన్నీ రంగరించిన శరీరచ్ఛాయ ఆమెది. కవులు కావ్యాలలో వర్ణించినట్టు కలువరేకుల కళ్ళు, సంపెంగ నాసిక, గులాబీ రేకుల్లాంటి పెదవులు, కృష్ణానదీ తరంగాల్లాంటి జుట్టుతో ప్రబంధనాయికలా వుంటుంది శ్రావణి. అయితే కుడి చెక్కిలి మీద ముక్కు నుంచి చుబుకం వరకు నల్లటి పుట్టుమచ్చతో ఆమె ముఖం గ్రహణం పట్టిన చందమామలా వుంటుంది. ఆ మచ్చ కారణంగా ఆమెని రెండు, మూడు పెళ్ళిసంబంధాల వాళ్ళు తిరస్కరించారు కూడా.

అలాంటిది ఇప్పుడు ఈ పెళ్ళి సంబంధం వాళ్ళు ఏరి కోరి శ్రావణిని పెళ్ళి చేసుకుంటాననడం, పైగా వాళ్ళే ఆమె ముఖంమీద మచ్చకి ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తామనడంతో శివరామ్ దంపతులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

'ఆ ఒక్క లోపం తప్ప నా కూతురికేం తక్కువ? అందాల భరిణ' అనుకుంటోంది సుమతి మురిపెంగా కూతురిని చూస్తూ.

"ఇదుగోండి మామయ్యా! అబ్బాయి ఫోటో!" సుమతి మామగారికి వరుడి ఫోటోని అందించింది.

"వాళ్ళ వైపునుంచి అభ్యంతరాలేం లేవు నాన్నా! మీరు అంగీకరిస్తే..."

"నేను అంగీకరించకపోతే ఈ సంబంధం వదిలేస్తావా?" ఫోటోని పరిశీలనగా చూస్తూ అడిగేడు వివేకానందమూర్తి.

"వదిలేస్తాను" స్థిరంగా అన్నాడు.

"సరదాగా అన్నాను లేరా!" నవ్వేడాయన.

సుమతి పెళ్ళివారు వచ్చే వేళయిందని శ్రావణిని స్నానం చేసి ముస్తాబవమని హెచ్చరించి హడావుడిగా వంటగదిలోకి నడిచింది.

* * *

వరుడు అభినవ్, నేటి యువతరానికి ప్రతినిధిలా వున్నాడు. అతని బట్టలు హెయిర్ స్టయిల్ మారుతున్న ఫ్యాషన్‌కి అనుగుణంగా వున్నాయి. అతని తల్లి ప్రసూన ఖరీదైన పట్టుచీర, డైమండ్ నెక్లెస్ ధరించింది. ఆవిడ మాటలలోనే కాదు, ప్రతి కదలికలోను భేషజం ఉట్టిపడుతోంది. వరుడి తండ్రి మధుసూదన్ మాటలలో కూడా డబ్బున్నవాడిననే గర్వం, దర్పం వ్యక్తమవుతున్నాయి.

పరస్పర పరిచయాలు నమస్కార ప్రతి నమస్కారాలు అయ్యాయి. కాఫీ ఫలహారాల తర్వాత సుమతి శ్రావణిని తీసుకొచ్చి, వాళ్ళకెదురుగా కూర్చోబెట్టింది.

"అమ్మాయి లక్షణంగా వుంది. సి.డి.లోకంటే చాలా అందంగా వుంది. కాకపోతే ఆ మచ్చే.." ప్రసూన పెదవి విరిచింది.

"ఐ థింక్ అది ప్లాస్టిక్ సర్జరీ ద్వారా పూర్తిగా తొలగించవచ్చు" అన్నాడు మధుసూదన్.

తాము కోడలిగా చేసుకోవాలనుకుంటున్న అమ్మాయి పేరయినా అడక్కుండా ఆమె ముఖం మీద మచ్చ గురించి ఆమెకెదురుగానే మాట్లాడుకుంటున్న వారి ధోరణి వివేకానందమూర్తికి నచ్చలేదు.

వున్నట్టుండి మధుసూదన్ దంపతుల దృష్టి వివేకానందమూర్తి బట్టతల మీద నుంచి నుదిటి మీదకి పాకి వున్న మచ్చ మీద పడింది.


"మీక్కూడా మచ్చ వుందే? మీ మనుమరాలికి నల్లమచ్చ, మీది తెల్లమచ్చ. మచ్చ మీ వంశంలో వారసత్వమా" ప్రసూన అదోలా నవ్వుతూ అడిగింది.

ఏదో జోక్ విన్నట్టు ఫకాల్న నవ్వేడు మధుసూదన్.

శివరామ్, సుమతిల ముఖాలు ఎర్రబడ్డాయి. వివేకానందమూర్తి అదే చిరునవ్వుతో తొణక్కుండా అన్నాడు.

"ఇది పుట్టుమచ్చ కాదు. ఒక గూండా కొట్టినప్పుడు అయిన గాయం తాలూకు మచ్చ"

"గూండాజోలికి ఎందుకు వెళ్ళారండీ?"



వివేకానందమూర్తి జవాబిచ్చే లోగానే మధుసూదన్ చేతిలోని సెల్‌ఫోన్ మోగింది.

వెంటనే రిసీవ్ చేసుకున్నాడాయన.

"జగన్నాథ్! ఎక్కడున్నావ్? ఎడ్రస్ తెలుసుగా? ఓ.కె." అని సెల్ ఆఫ్ చేసి చెప్పాడు.

"నా ఫ్రెండ్ డాక్టర్ జగన్నాథ్! అపోలో హాస్పిటల్లో ప్లాస్టిక్ సర్జన్‌గా పనిచేస్తున్నాడు. ఏదో పని మీద ఈ ఊరొచ్చాడు. మీ అమ్మాయి చెంపమీద మచ్చని పరీక్షించడం కోసం ఇక్కడ కొస్తున్నాడు"

వివేకానందమూర్తి అభినవ్‌ని పరిశీలనగా చూస్తున్నాడు.

"నిశ్చితార్థానికి ముందే ప్లాస్టిక్ సర్జరీ జరిగిపోవడం మంచిది. లేకపోతే సిడిలో ఫోటోల్లో ఎంత అసహ్యంగా కనిపిస్తుందా మచ్చ?" అప్పటివరకు నోరు విప్పి ఒక్క మాటయినా మాట్లాడని అతను అన్నాడు.

శివరామ్, సుమతిల ముఖాలు నల్లబడ్డాయి.

"కనీసం మా మనుమరాలి పేరయినా అడగలేదు మీరు" అన్నాడాయన.

"ఏ పేరయితేనేమండీ! అంతగా పేరు నచ్చకపోతే మార్చుకోడం పెద్ద పనా?" ప్రసూన అతిశయంగా అంది.

వివేకానందమూర్తి చిరునవ్వుతో చూస్తున్నాడు.

వీధిలో కారాగిన శబ్దం. కొన్ని క్షణాల తర్వాత లోపలికి వస్తున్న నడివయసు వ్యక్తిని "హలో! జగన్నాథ్!" అని ఆడంబరంగా పలుకరించాడు మధుసూదన్. ఆ ఇద్దరి కరచాలనం పలుకరింపుల తర్వాత మామగారి సైగతో సుమతి కాఫీ ఫలహారాలు తెచ్చి ఇచ్చిందాయనకి..తామెవ్వరినీ జగన్నాథ్‌కి పరిచయం చెయ్యకపోవడం వివేకానందమూర్తిని ఆశ్చర్యపరిచింది. "ఈ అమ్మాయే!" అర్థోక్తిలో ఆగాడు మధుసూదన్.

శ్రావణి మర్యాదగా నమస్కరించింది.

డాక్టర్ జగన్నాథ్ ఆమె దగ్గరకొచ్చి ఆమె చెక్కిలి మీద మచ్చని పరీక్షించాడు.

"నో ప్రాబ్లెం! ప్లాస్టిక్ సర్జరీ చేసి ఈ మచ్చని పూర్తిగా తొలగించవచ్చు"

ఆ క్షణంలో మధుసూదన్ దంపతుల ముఖాలలో ప్రత్యేకించి అభినవ్ కళ్ళలోని మెరుపు వివేకానందమూర్తి దృష్టిని దాటిపోలేదు.

"నాకు ఫ్లయిట్ టైమయింది. నేను బయలుదేరుతాను" అన్నాడు జగన్నాథ్.

"ఓ.కె. సర్జరీకి డేట్ ఫిక్స్ చేసి నాకు చెప్పు. సర్జరీ తర్వాతే నిశ్చితార్థం పెళ్ళి పెట్టుకుంటాం" అన్నాడు మధుసూదన్.

"నువ్వు ఇంటర్మీడియెట్ ఎక్కడ చదివేవు అభినవ్?" వున్నట్టుండి అడిగేడు వివేకానందమూర్తి.

"విజయవాడలోనండీ"

"నేను కూడా విజయవాడలోనే లెక్చరర్‌గా పనిచేసేవాడిని"

"ఐసీ"

"నేను నీకు గుర్తున్నానా?"


"నేను గతంలో మిమ్మల్నెక్కడా చూడలేదు"

"నా నుదుటి మీద గాయం తాలూకు మచ్చ చూసాకైనా నన్ను గుర్తుపట్టలేదా నువ్వు?"

అభినవ్ బ్లాంక్‌గా చూసాడు.

"నేను లెక్చరర్‌గా పనిచేసి రిటైరై చైతన్య కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా చేరాను. లయోలా కాలేజీ ఇంటర్మీడియెట్ ఫిజిక్స్ పేపరు వ్రాస్తున్నావు నువ్వు. పాపం క్వశ్చన్ పేపరు కష్టంగా వుందో లేక నువ్వు పరీక్షకి సరిగా ప్రిపేరవలేదో తెలియదు. కాపీ కొడుతూ పట్టుబడ్డావు. ఆరోజు నిన్ను పట్టుకున్న ఇన్విజిలేటర్ని నేనే! కాస్సేపు నీ ఫ్యూచర్ పాడవుతుందని, నీ కెరీర్ మీద మచ్చ పడుతుందని వదిలెయ్యమని బ్రతిమాలావు. నేను లొంగలేదు. తరువాత మీ మామయ్య ఎమ్ ఎల్ ఏ అని అతని పేరు చెప్పావు. నేను భయపడలేదు. నీ చేతిలోని ఆన్సర్ షీటు స్లిప్పుతో సహా లాక్కుని నిన్ను పరీక్ష హాలులో నుంచి బయటికి పంపేను. ఆ మరునాడు చీకట్లో ఒంటరిగా వస్తున్న నన్ను కర్రతో తలమీద కొట్టి పారిపోయావు. అప్పుడు నా తలకి పడిన కుట్లు పది. ఆ గాయం మానినా మచ్చ మానలేదు. నిన్ను నేను మరచిపోలేదు. అప్పటికి ఇప్పటికీ నీలో మార్పేమీ లేదు. నీ ఫోటోని చూడగానే గుర్తుపట్టాను. అవునూ నీ బిటెక్, ఎమ్‌బిఏ డిగ్రీలు నిజమేనా? అప్పుడు కాపీ కొడుతూ పట్టుబడ్డాకైనా బుద్ధిగా చదువుకున్నావా? లేక చదువుకొన్నావా?" అభినవ్ ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

పాలిపోయిన అతని ముఖం ఎర్రబడింది.




"షటప్! మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి" అన్నాడు తీవ్రస్వరంతో.

మధుసూదన్ దంపతుల ముఖాలలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. పరాభవం తాలూకు బాధ వాళ్ళ ముఖాలలో వ్యక్తమవుతోంది.

"మిస్టర్ అభినవ్?" శ్రావణి శ్రావణ మేఘంలా గర్జించింది.

"మా తాతయ్య మీ నిజ స్వరూపాన్ని బయట పెట్టారనా మీ ఉలుకు? నా ముఖం మీద మచ్చని ప్లాస్టిక్ సర్జరీతో తొలగించవచ్చు. కానీ వికృతమైన మీ మనసులని మార్చడానికి ప్రపంచంలోనే ఏ సర్జరీ ఇంతవరకు కనిపెట్టలేదేమో! మీకు కావలసింది మీ జీవిత సహచరి కాదు. ఈమె నా భార్య అని సొసైటీలో గర్వంగా పరిచయం చేసుకోడానికి అందమైన ఆడబొమ్మ కావాలి. ఆమె తల్లిదండ్రులు పెట్టిన పేరు నచ్చకపోతే వాళ్ళ సెంటిమెట్లతో పనిలేకుండా మార్చెయ్యగలరు. ఆ బొమ్మలో ఏవైనా లోపాలుంటే డబ్బు వెదజల్లి సరిదిద్దగలరు. ఒక్కసారి మీ మనసు లోతులలోకి తొంగిచూసుకోండి. ఎన్ని మచ్చలున్నాయో! డబ్బుతో దేన్నయినా కొనెయ్యగలమనే అహం, దర్పం, మనిషిని మనిషిగా గౌరవించలేని కుసంస్కారం, మా మాటే చెల్లుబాటవాలనే అహంకారం. ఇన్ని మచ్చలున్న మిమ్మల్ని పెళ్ళి చేసుకోలేను. మిమ్మల్ని అత్తమామలుగా గౌరవించలేను. దయవుంచి ఇక్కడ నుంచి వెళ్ళిపొండి" చరచర లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె నిర్ణయాన్ని సమర్థించినట్టుగా చిరునవ్వుతో తలపంకించారు వివేకానందమూర్తి, సుమతి, శివరామ్‌లు. అవమానంతో ఎర్రబడిన ముఖాలతో నిష్క్రమించారు పెళ్ళివారు.

○



## ప్చ్! ఫర్జానా

కొరియోగ్రాఫర్ నుంచి హీరోయిన్‌గా మారిన ఫర్జానాకి ఎప్పటికప్పుడు అవకాశాలు కలిసొస్తూనే వున్నాయి. అయితే తన పర్సనాలిటీ విషయంలో ఆమెకి కాస్తంత నిర్లక్ష్యం కూడా తోడయింది అంటున్నారు సన్నిహితులు. ఇప్పుడామె గ్లామర్ విషయంలో తగిన శ్రద్ధ చూపించడం లేదట. ఇష్టం వచ్చినట్టు తినేస్తూ బరువు పెరిగిపోతోందిట. ఇలాగయితే మరికొన్ని రోజుల్లో బాగా లావైపోయి హీరోయిన్ చాన్సులను పోగొట్టుకోవాల్సి వస్తుంది కదా అని అనేది ఆమె సన్నిహితుల బాధ. ప్చ్!